క్లుప్తంగా

ఎట్టకేలకు గుర్రపుడెక్క తొలగింపు



కాలువలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

భోగాపురం: స్థానిక మేజర్ పంచాయతీలోని బట్టీ(కాలువ)లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను ఆదివారం తొలగించారు. ఇటీవల ఈ కాలువలో విపరీతంగా పెరిగిపోయిన పూడికలు, తీగమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఇటువంటి ఖాళీస్థలాలే దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయన్న దానిపై ఖాళీ స్థలాలు–దోమలకు ఆవాసాలు శీర్షిక పేరిట సాక్షి దినపత్రికలో ఇటీవల వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు కాలువలోని వ్యర్థాలు తొలగించారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



పూసపాటిరేగ: ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మన గ్రోమోర్ షాపును తనిఖీ చేసి, ఆ షాపులోని నిల్వ ఎరువులు, రికార్డులు పరిశీలించి సరిచూశారు. అక్కడి నుంచి పేరాపురం వేంకటేశ్వర ట్రేడర్స్‌కు వెళ్లి, అక్కడి ఎరువులు, పురుగుమందుల అమ్మకాల రికార్డులు చూసి, స్టాక్‌కు సరిపడ నిల్వలు ఉన్నాయా లేదా అనేది చూశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, విజిలెన్స్ అధికారి ఎ.కామేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

డెంకాడ: ఎరువుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి టి.సంగీత హెచ్చరించారు. మండలంలోని సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్ ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపును వారు ఆదివారం తనిఖీ చేశారు. షాపులోని ఎరువుల నిల్వలను, స్టాకు రిజిస్టర్‌లతో పోల్చి సరిచూశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



విజయనగరం ఫోర్ట్: తనిఖీలు చేస్తున్న అధికారులు


విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల్లో తేడాలు ఉండడంతో మాత వెంకటేశ్వర దుకాణంలోని రూ.2.70 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగభూషణరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో.. తస్మాత్!

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- కురుస్తున్న వర్షాలతో మారుతున్న వాతావరణం
- ఇప్పటికే వైరల్ జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమని వైద్యుల సూచన



విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు(ఫైల్)



విజయనగరం ఫోర్ట్: వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా వర్షపు నీరు దిగువ ప్రాంతాల్లో నిల్వ ఉంటోంది. ఈ నీరు అలాగే చాలాకాలం నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. వీటికి తోడు ఇప్పటికే చాలా మంది అతిసారం, జ్వరాలతో మంచానపడి బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వానాకాలం మొదలైందంటే చాలు చాలా జాగ్రత్తగా ఉండాలని లేకుంటే ప్రమాదం కొనితెచ్చుకున్న వారమవుతామని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని రకాల వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలపై కథనం..

జలుబు, జ్వరం..

ప్రస్తుతం సీజన్ మారడంతో వాతావరణంలోకి చేరే కొత్త కొత్త సూక్ష్మక్రిముల వల్ల వచ్చే జ్వరాన్ని వైరల్ జ్వరం అంటారు. ఇది గాలి, నీటి ద్వారా ఎక్కువగా వ్యాపిస్తుంది. సాధారణ జ్వరం వైరస్ రకాన్ని బట్టి ఉంటుంది. జ్వరం మాత్రమే ఉన్నప్పటికీ కొంతమందికి దగ్గు, కీళ్లనొప్పులు కూడా సాధారణ జ్వరంతో పాటే ఉంటాయి. కానీ ఈ లక్షణాలేవీ డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులవి కావు. వైరల్ జ్వరం మూడు రోజుల నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది.

- తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..
- భోజనానికి ముందు తర్వాత చేతులను బాగా శుభ్రం చేసుకోవాలి
- నిల్వ ఆహార పదార్థాలేవీ తినకూడదు
- తాజా పండ్లు తీసుకోవాలి
- వర్షంలో తరచూ తడవకూడదు
- తడిచిన బట్టలతో ఎక్కువ సేపు ఉండకూడదు
- రద్దీ బాగా ఉండే ప్రాంతాల్లో ఉండకూడదు
- మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.

చికెన్‌గున్యా..

చికెన్‌గున్యా జ్వరం వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఇది దోమకాటు వల్ల వస్తుంది. అధిక జ్వరం, కీళ్లనొప్పులు చికెన్‌గున్యా లక్షణాలు. ఇది వచ్చిన మొదటి రెండు, మూడు రోజుల పాటు జ్వరం ఎక్కువగా ఉంటుంది.

- పాటించాల్సిన జాగ్రత్తలివే..
- ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కూలర్లు, టైర్లు వంటి వాటిలో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంచొద్దు
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి

మలేరియా..

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం వంటివి మలేరియా వ్యాధి లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత కూడా మళ్లీ వస్తుంది. జ్వరం తగ్గిపోయిన తర్వాత మళ్లీ వచ్చినట్టు అయితే మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది. దోమకాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరం లోపలికి వెళ్తాయి. 14 రోజుల తర్వాత జ్వరం అధికమవుతుంది.

జాగ్రత్తలు..

మలేరియా నివారించడానికి దోమతెరలు వినియోగించుకోవాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు పేరుకుపోతే అందులో కిరోసిన్ గానీ పురుగు మందు గానీ కలపాలి.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రతి సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. కొన్నిచోట్ల వైద్య శిబిరాలు పెట్టి వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెబుతున్నాం. –డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ, విజయనగరం

డెంగీ..

వైరల్ జ్వరం మాదిరి అకస్మాత్తుగా వచ్చి తీవ్రంగా పరిణమిస్తుంది. ఇది వస్తే తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులతో ఎముకలు విరిగేటంత నొప్పి కలుగుతుంది. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం కూడా కలిగి కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరభాగాల చర్మంపై ఎర్రగా కందినట్టు చిన్నచిన్న మొటిముల వస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోయి పరిస్థితి విషమంగా తయారవుతుంది. ఈడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వల్ల ఇది వస్తుంది. ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దర్లు వస్తాయి. ఇళ్లల్లోని కుండీలు, గోలేలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఎయిర్ కూలర్లు, ఇళ్ల పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ కప్పులు, పగిలిన సీసాలు, టైర్లు వంటి వాటిల్లో చేరే వర్షపునీటిలో ఈ దోమ గుడ్లు పెట్టి పెరుగుతుంది.

జాగ్రత్తలు..

ఇంటి పరిసర ప్రాంతాల్లో వృథా నీటిని నిల్వ ఉంచరాదు. పెంటకుప్పలు, ఇంట్లో వచ్చే చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి. ఇళ్లల్లోని అన్ని గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలి. దోమతెరలు వాడడం లేదా ఇంటి కిటికీలు, తలుపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. నీరు నిల్వ చేసే పాత్రలను ప్రతి వారానికి ఒకసారి ఖాళీ చేసి మళ్లీ నీటిని నింపుకోవాలి. నీళ్ల ట్యాంకులపై సరిగ్గా మూతలు పెట్టుకోవాలి. దోమకాటు నుంచి రక్షణకు శరీరమంతా కప్పి ఉంచుకునేలా దుస్తులు ధరించాలి. ముఖ్యంగా బట్టలు లేకుండా పిల్లలను బయట తిరగనీయరాదు. కుళాయిల దగ్గర నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి, చికిత్స పొందాలి.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దాతలు

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో అమ్మ–నాన్న స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు నేపథ్యంలో అందరూ మట్టి విగ్రహాలు వాడేలా ప్రోత్సహిస్తూ గణేశుని ప్రతిమలు పంచిపెట్టడం జరిగిందని సంస్థ అధ్యక్షుడు మధుసూదనరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లోని మదర్‌థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మట్టి వినాయక ప్రతిమలు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.ప్రసాద్‌పట్నాయక్, గౌరవాధ్యక్షుడు వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు. అదే ప్రాంతంలో సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు.

బంగారునాయుడికి కీలక బాధ్యతలు



సజ్జల రామకృష్ణారెడ్డితో బంగారునాయుడు

విజయనగరం: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు ఆ సమావేశానికి హాజరుకాగా ఆయనకు పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలతో పాటు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలైన యువజన, మహిళ, విద్యార్థి, బూత్ కమిటీలు, కార్మిక, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గ్రీవెన్స్, మున్సిపల్, ఇంటలెక్చువల్, టీచర్స్, వలంటీర్స్, అంగన్‌వాడీ, రైతు, పంచాయతీరాజ్, క్రిస్టియన్, చేనేత, దివ్యాంగులు, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్, వాణిజ్య, ఆర్‌టీఐ, ప్రచార, డాక్టర్స్, ఐటీ, సాంస్కృతిక, చేతివృత్తులు, కమ్యూనిటీ విభాగాల పరిశీలకులుగా బాధ్యతలు అదనంగా అప్పగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుని నాయకత్వంలో పార్టీ పెద్దలు, నియోజకవర్గ సమన్వయకర్తల సూచనలతో పార్టీ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు, కార్యాచరణను విజయవంతంగా నిర్వహించాలని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా విగ్రహాలు పెట్టొద్దు



మాట్లాడుతున్న జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు సత్యలత

విజయనగరం: భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా దేవాది దేవుడైన శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాలు ఏర్పాటు చేయడం తగదని జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత అన్నారు. ఇదే విషయమై ఆమె దాసన్నపేటలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు జిల్లా, తక్కెళ్లపాడు గ్రామంలోని స్థానికులు శ్రీకృష్ణుని విగ్రహాన్ని స్వర్గీయ ఎన్టీఆర్ రూపంలో పెట్టడాన్ని యాదవ సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భగవంతుడు అందరి రూపాల్లోనూ ఉంటారని, అటువంటి భగవంతుడిని సినీ పరిశ్రమ రకరకాల హీరోలతో ప్రేక్షకులకు చూపించడం జరుగుతోందన్నారు. వారు చూపించేది ప్రేక్షకులను రక్తి కట్టించడానికే పరిమితం కావాలి తప్ప పూర్తిగా సమాచారం తప్పుడుగా ఉండేలా చేయవద్దన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ మంచి నటులు, గొప్ప రాజకీయవేత్త కానీ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఆయన రూపంలో పెట్టడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. భగవంతుడిని భక్తితో మాత్రమే ఆరాధించాలని, రాజకీయ లబ్ధి కోసం ఎన్టీఆర్ రూపాన్ని, శ్రీకృష్ణుని రూపానికి ముడిపెట్టడాన్ని భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. అలాగే రాజమండ్రిలో గోదావరి నది ఒడ్డున ఎన్టీఆర్ రూపంలోని శ్రీకృష్ణుని విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ గువ్వల తిరుపతిరావు, నాయకులు బొద్దన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



కూటమి మోసపూరిత పాలనను వివరిస్తున్న శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ప్రతి ఎన్నికలప్పుడు ప్రజలకు ఎన్నో రకాల హామీలివ్వడం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసగించడం ఆయనకు అలవాటు అయిపోయిందని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లలపేటలో ఆదివారం పర్యటించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే అన్ని హామీలు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు చేస్తూ జగనన్న పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు మాత్రం అరకొరగా అందిస్తున్న పథకాలు కూడా వారికి నచ్చిన వారికే కూటమి నాయకులు అందిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాల్లో ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు.

మిగతా హామీలేవీ?

ఎన్నికల ప్రచార సమయంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తానని, ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తున్నారని, తల్లికి వందనం డబ్బులు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం చాలామంది అర్హులకు అందలేదన్నారు. ఉచిత బస్సు కూడా కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానన్నారని, 50 ఏళ్లకే బీసీలకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, పల్లెలు, పట్టణాల్లోని నిరుపేదలకు ఇళ్లస్థలాలు అందజేస్తామన్నారని, అవెప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి మోసపూరిత పాలనకు స్వస్తి పలుకుతారన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు..

అనంతరం విజయనగరం మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు మాట్లాడుతూ కూటమి నాయకులు అధికార దర్పం ప్రదర్శిస్తూ నీచరాజకీయాలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. లోకేశ్ ఆదేశాలతో ప్రభుత్వ, కూటమి నాయకుల అక్రమాలు ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఎగబడుతున్నారని, అన్యాయంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెడితే బాగుంటుందని హితవుపలికారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.పైడమ్మ, పార్టీ నాయకులు బి.రామునాయుడు, డి.భాస్కరరాజు, వైస్ ఎంపీపీ కె.నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.నాగరాజు, రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.బంగారునాయుడు, మండల ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, బి.అప్పలకృష్ణ, దుప్పాడ సర్పంచ్ కె.రాములప్పుడు, మాజీ సర్పంచ్ బి.రమణ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న గ్రామస్తులు

సామాజిక చైతన్యమే లక్ష్యం

విజయనగరం అర్బన్: సామాజిక చైతన్యం కలిగించడమే జనవిజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల కృష్ణారావు అన్నారు. స్థానిక గురజాడ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇకపై జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలను చైతన్యపరుస్తూ వారిలో సామాజిక స్పృహ కలిగించేలా కృషి చేస్తామన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మార్వాడీ యువ మంచ్ మహిళా విభాగం విశాఖ చైర్‌పర్సన్ జై శ్రీహిరావత్

విజయనగరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఐనాక్స్ భవన సముదాయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్(బిడ్డకు తల్లిపాలు ఇచ్చే గది) ఆదివారం ప్రారంభించారు. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో బిడ్డకు తల్లిపాలు ఇచ్చేందుకు అసౌకర్యవంతంగా ఉండడంతో ఇలా ప్రత్యేకంగా ఓ గదిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మార్వాడీ యువమంచ్ మహిళా విభాగం విశాఖ చైర్‌పర్సన్ జై శ్రీహిరావత్ తెలిపారు. ప్రతి పట్టణంలో రద్దీగా ఉండే చోట మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఈ గదుల ఏర్పాటు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మార్వాడీ యువమంచ్ విజయనగరం అధ్యక్షుడు అభిషేక్ శర్మ, అభిజ్ఞ, దీపాశర్మ, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు

విజయనగరం టౌన్: స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహం విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆదివారం బహుమతులు అందజేశారు. పోటీ పరీక్షలకు పనికి వచ్చేలా సంక్షేమ అధికారిణి డి.రాధామణి విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ పుస్తకాలను అందించారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించండి

విజయనగరం అర్బన్: బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని, వారిని బోధనకే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పైడిరాజు కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఎఫ్, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేటీ కమిటేషన్ చెల్లించాలని, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించి పీఆర్‌సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయుడుని ఆందోళనకు గురిచేయకుండా ప్రశాంతంగా పాఠశాలలో విద్యను బోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

10 మంది పనిచేస్తే ఈఎస్ఐ పరిధిలోకి..

విజయనగరంఫోర్ట్: స్థానిక ఈఎస్ఐ కార్యాలయంలో ఈఎస్ఐ సహాయ సంచాలకులు వి.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈఎస్ఐ చట్టం 1948లో చేయడం జరిగిందని, దాని ప్రకారం ఏ సంస్థలోనైనా 10 మంది కార్మికులు పనిచేస్తే ఈఎస్ఐ పరిధిలోకి వచ్చేస్తారని తెలిపారు. విశాఖ ఈఎస్ఐ సబ్ డివిజనల్ కార్యాలయం పరిధిలో ఆరు జిల్లాలు ఉన్నాయని, ఇప్పటివరకు ఈఎస్ఐ పరిధిలోకి రానివారు తక్షణమే ఈఎస్ఐ కార్యాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఎన్నిక ఏకగ్రీవం

విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లా అ గ్నిమాపక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అధికారి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ పర్యవేక్షించారు. ఈ ఎన్నికలో పార్వతీపురం అగ్నిమాపక కేంద్రంలో దళపతిగా పనిచేస్తున్న రమేష్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా ఎస్.కోటకు చెందిన వి. కృష్ణమోహన్ కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా డి. ప్రకాష్(బొబ్బిలి), జాయింట్ సెక్రటరీగా ఎస్.కె.జగదీష్(సాలూరు), సలహాదారుగా ఎల్.ఉమా మహేశ్వరరావు(గజపతినగరం), కోశాధికారిగా జి.ఆదినారాయణ (చీపురుపల్లి) ఎన్నికయ్యారు.

ఆత్మీయ సమ్మేళనం

విజయనగరం టౌన్: జిల్లా రచయితల సంఘ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షుడు జీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవి వేమకోటి శ్రీలక్ష్మి రచించిన తొలిపొద్దు కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మానాపురం రాజా చంద్రశేఖర్ పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయితను మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, నాలుగెస్సుల రాజు, సంఘ కార్యదర్శి రఘునందన్ అభినందించారు.